01ATP06FF.qxd:01ATP06FF.qxd 07/07/26 11:26 PM Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 07 జూలై 2026 పేజీలు : 04

రచ్చ చేసి..మచ్చ తెచ్చి..!

అనుచరుల ఆగడాలు..అధికార అండదండలు..!

❖ అక్రమాలపై ప్రజల్లో పెల్లుబికుతున్న అసహనం ❖ కార్యకర్తల్లో పెరుగుతున్న అసంతృప్తి

రాత్రి దొంగల దోపిడీతో రాయల'చెరువుకు కరవవుతున్న రక్షణ

యాడికి(తాడిపత్రి), జులై 6, ప్రభాతవార్త

ప్రజల ఓట్లతో గెలిచే నాయకులు ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలనేది ప్రతి ఒక్కరు చెప్పేమాట. అయితే చాలా చోట్ల రాజకీయం ఓ వ్యాపారంగా మారిపోయింది. రాజకీయం ముసుగులో పార్టీ అండదండలు చూసుకొని కొందరు చోటా మోటా నాయకులు చెలరేగిపోతున్నారు. పార్టీనేతల ఆశీస్సులు ఉంటే పోలీసులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉంటాయనే ఉద్దేశంతో కండువాలు భుజాన వేసుకొని రెచ్చిపోతున్న ఈ అక్రమార్కులతో ప్రజలకు కలిగే ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపోటములపై వీరి దుష్ప్రభావాన్ని తలచుకొని స్వచ్ఛమైన కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందినకాడికి దోచుకుంటూ ప్రజా సమస్యలను, కార్యకర్తలను గాలికి వదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ అక్రమాలతో రచ్చచేసి పార్టీకి మచ్చ తెస్తున్నారనే విమర్శలు ఈ అక్రమార్కులపై రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.

అక్రమ రవాణా..చెరువుకు కరవవుతున్న రక్షణ..!

రూ. కోట్ల విలువైన రాయల'చెరువు ఒండ్రుమట్టిని మింగేసి చెరువు అభివృద్ధిని, గ్రామ పురోగతిని గాలికి వదిలేసిన చోటా నాయకులు ప్రస్తుతం రాయల'చెరువు ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చారు. చెరువు ప్రతిష్టకు, పటిష్ఠతకు ఆళవాలమైన ఊరగుట్ట, రిజర్వు గుట్టల్లో గ్రావెల్ కోసం అక్రమార్కులు ఇష్టారీతిన తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నా అడిగేనాథుడే లేరు. ఒక్కో టిప్పరు గ్రావెల్ రూ. 5 వేలు వరకు విక్రయిస్తూ చెరువును చెరబట్టిన వలసవచ్చిన ఈ చోటా నాయకుల తీరును గ్రామస్థులు గమనిస్తూ నిలదీసే రోజు కోసం ఎదురు చూస్తున్నారు. రూ. కోట్లతో జరిగే ఈ దందాతోనే ఆర్థికంగా ఎదగడం, అడ్డొస్తే బెదిరింపులకు దిగడం సర్వసాధారణంగా మారింది. మాఫియాను తలపించేలా సాగిన, సాగుతున్న ఒండ్రుమట్టి, గ్రావెల్ రవాణాపై అధికారులు సైతం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి అధికారులను కట్టడి చేయడం, ఇతరులెవరైనా అనుమతులతో గ్రావెల్ రవాణా చేస్తే చిన్న చిన్న తప్పులను చూపి అదే అధికారులతో దాడులు చేయించడం ఇక్కడ పరిపాటిగా మారింది.

హాజరు కనికట్టు..అక్రమాలు ఎవరు కనిపెట్టు...?

ఉపాధిహామీని మింగేస్తున్న అవినీతిపై కూలీల ఆగ్రహం

వ్యవసాయ కూలీలకు ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ఈ పథకంలోని లొసుగులను తొలగించడానికి ఎప్పటికప్పుడు సాంకేతిక మార్పులు తెస్తున్నప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. అసలైన కూలీలకు ఆలస్యంగా చెల్లింపులు, అక్రమ హాజరుకు అడ్డదారి చెల్లింపులు ఈ పథకంలో రివాజుగా మారింది. అక్రమంగా హాజరు పొందే కూలీలు, మేట్‌లు, ఎఫ్ఏల నుంచి సంబంధిత అధికారులందరికీ మీకింత..మాకింత అనే చందంగా ఉపాధి సొమ్ము బట్వాడా సాగిపోతోంది. వీరు తినే విధానంలో ఆయా గ్రామస్థాయి నాయకులకు కూడా నైవేద్యం సమర్పించుకోవాల్సి వస్తోంది. చోటా నాయకుల్లో ఎక్కడా లేని ఐక్యత ఈ ఉపాధి అక్రమాల సొమ్ము మేయడంలో బాగా కనిపిస్తోందని ఆ పార్టీ కార్యకర్తలే వ్యంగ్యోక్తులు విసురుతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో నెలకు కనీసం రూ. 1 లక్ష అక్రమ హాజరుతో ఉపాధి సొమ్ము పక్కదారి పడుతున్నట్లు బహిరంగ చర్చ నడుస్తోంది. కొన్నిచోట్ల ఊర్లకు ఊర్లే అక్రమహాజరుతో పబ్బం గడుపుతున్నట్లు చర్చ నడుస్తోంది.

వాయుబండ..అవినీతే నిండా..!

బ్లాక్‌మార్కెట్ విక్రయాలు, సకాలంలో అందని దుస్తితితో వినియోగదారుల నెత్తిన గుదిబండలా మారిన వాయుబండ మరో మార్గంలో కూడా వారిని వేదిస్తోంది. గ్యాస్ ఏజెన్సీ నిర్వహకుల మాయాజాలంతో ఒక్కో సిలిండరులో 277 గ్రాముల గ్యాస్ తక్కువగా వస్తోందని ఇటీవల అధికారుల తనిఖీలే తేల్చాయి.తద్వారా మండలవ్యాప్తంగా ఉన్న 12 వేలకు పైగా వినియోగదారులు ప్రతి నెలా రూ.75 వేలకు పైగా

గ్యాస్ సిలెండర్‌లు తనిఖీ చేస్తున్న పోలీసులు

నష్టపోతున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నా..అంతకు రెట్టింపు సొమ్మే తింటున్నారనేది బహిరంగ రహస్యం. అధికారం అండతోనే తమ అక్రమాలను కనిపెట్టకుండా అధికారులను కట్టడి చేస్తున్నారని, ఇలా దాదాపు రెండు దశాబ్దాలకు పైగా ఏటా దాదాపు రూ. 9 లక్షలు, ఇప్పటి వరకు రూ. 2 కోట్ల వరకు దొడ్డిదారిలో వినియోగదారుల నెత్తిన టోపీ పెట్టారనేది కాదనలేని సత్యం. ఇలాంటి అక్రమ సంపాదనలకు అండగా ఉంటుందనే రాజకీయ రంగు పూసుకొని తిరుగుతండటం, ప్రజల చెంతకు వచ్చినప్పుడు వేదాలు వల్లించడం కొందరు చోటా నాయకులకు పరిపాటిగా మారింది.

ఖ'నిజ్ఞ మాయం..దోపిడీ ఖాయం..!

కొండుపల్లి గనుల అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

పెద్దవడుగూరు మండలం కొండుపల్లి భూగర్భ గనుల్లో ఏళ్ల తరబడి యథేశ్చగా సాగుతున్న ఖనిజ దోపిడీ అటు చోటా మోటా నాయకులకు, ఇటు అవినీతి అధికారులకు జేబులు నింపుతోంది. నిబంధనలకు పాతరేసి సాగిస్తున్న ఖనిజ తవ్వకాలవైపు కన్నెత్తి చూడని అధికార యంత్రాంగంతో ప్రభుత్వాదాయం, సహజ సంపద దోపిడీకి గురవుతోంది. వీటిపై ఎన్ని ఫిర్యాదులు వెల్లువెత్తినా అధికారులు తీసుకున్న చర్యలు దాదాపు శూన్యమనే చెప్పాలి. విలువైన స్టీటైట్, డోలమైట్ వంటి ఖనిజాలను అక్రమంగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నా వారికే కొందరు అధికారులు వంత పాడుతుండటం విడ్డూరం. అనుమతులను అటకెక్కించి తవ్వుకున్నా, పరిధిదాటి తవ్వుకుంటున్నా.. నిబంధనలను మింగేసి తవ్వుకున్నా గనులు, రెవెన్యూ, పోలీసు, గనుల భద్రత, పర్యావరణ శాఖల అధికారులు ఏళ్ల తరబడి నిద్ర నటిస్తున్నారంటే అవినీతి స్థాయి ఏ పాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మూగజీవాల సంత..దగాకు వంత..!

ఇక మరికొందరు చోటా నాయకులు ప్రభుత్వ, పంచాయతీ ఆదాయాన్ని కొల్లగొట్టి గొర్రెల సంతతో తమ జేబులు నింపుకుంటున్నారు. మార్కెటింగ్, పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లు ఆ నాయకులకు అప్పగించి వారు సాగించే దందాను కళ్లప్పగించి చూస్తున్నారు. నెలకు రూ. 1.5 లక్షలకు పైగా గొర్రెల సంత ద్వారా వచ్చే ఆదాయాన్ని పక్కదారిలో మేస్తుంటే గొర్రెల్లా అధికారులు తలలు ఊపుతున్నారని యాడికి గ్రామస్థులు ఘాటుగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక మండలంలో 30కి పైగా గొలుసు దుకాణాల ద్వారా దాదాపు రూ. 3 లక్షలు, మద్యం దుకాణాల్లో అధిక ధరల ద్వారా నెలకు రూ. 10 లక్షల దోపిడీ సాగుతోందని, నెలకు ఒక్కో దుకాణం నుంచి రూ.20 వేలతో సంబంధిత శాఖ అధికారుల చేతులు తడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పురుగుల మందు సీసా పట్టుకొని మీరు ఓటేయకుంటే చస్తానని ఎస్సీ, బలహీన వర్గాల ఓటర్ల చుట్టూ తిరిగిన ఓ నాయకుడు ఆ వర్గాలకు చెందిన దాదాపు 70 మందితో ఒక్కొక్కరితో రూ. 32 వేలు సామాజిక పింఛన్ల సదరం సర్టిఫికెట్ల కోసమని వసూలు చేసినట్లు తెలుస్తోంది. రెండేళ్లు గడచినా పింఛన్లు రాకపోవడంతో సదరు సదరం బాధితులు ఇంకా పింఛన్లు రావడం లేదని, తాము పురుగుల మందు సీసాలు తీసుకొని సదరు నాయకుని ఇంటి వద్దకు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ గురువులాంటి వ్యక్తి తనవద్దకు వచ్చే యువతను అనైతిక, అక్రమ మార్గాల్లోకి మళ్లిస్తున్నాడని, వారిని అసాంఘిక శక్తులుగా మారుస్తున్నాడనే వాదన సర్వత్రా వినిపిస్తుండటం గమనార్హం. చట్టవ్యతిరేక పనులు చేసేవారికి ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీసు స్టేషన్లలో భరోసా కల్పించే విధంగా ప్రవర్తిస్తుండటం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా అధికార అండతో అక్రమాలతో రచ్చచేసి పార్టీకి మచ్చ తెచ్చే విధంగా మారిన నాయకుల తీరుపై అటు ప్రజలు, ఇటు కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతుండటం గమనార్హం.

---

45 రోజుల్లో రూ.29 లక్షల విలువైన

141 మొబైల్ ఫోన్ల రికవరీ

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

మొబైల్ ఫోన్ల యజమానులకు రికవరీ ఫోన్లను అందిస్తున్న జిల్లా ఎస్పీ

శ్రీ సత్యసాయి జిల్లా, జూలై 06, ప్రభాతవార్త ప్రతినిధి

సత్యసాయి జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన రూ.29 లక్షల విలువైన 141 మొబైల్ ఫోన్లను బాధితులకు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సంబంధిత హక్కుదారులకు అందజేశారు. పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో మొబైల్ ఫోన్ అత్యంత ముఖ్యమైన సాధనంగా మారిందని, అందువల్ల దానిని ఎల్లప్పుడూ జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న మరియు చోరీ కేసులకు సంబంధించి సి ఈ ఐ ఆర్ పోర్టల్, ఐఎంఈఐ నంబర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మిగతా 3లో..

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

కేజీబీవీల్లో మొదలైన విజయపథం..!

- లక్ష్యబద్ధమైన ప్రణాళికతో విద్యార్థినులు ఉపాధ్యాయుల నిరంతర శ్రమ
- రోజువారీగా పరీక్షలు, వారానికో గ్రాండ్ టెస్ట్ - అభ్యసన స్థాయిపై ప్రత్యేక పర్యవేక్షణ

అనంతపురం న్యూటౌన్, జూలై 6 ప్రభాతవార్త

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీలు) ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచే "విజయపథం" కార్యక్రమం విద్యా వాతావరణానికి కొత్త ఊపు నిచ్చింది. "అభ్యసనమే లక్ష్యం - విజయమే గమ్యం" అనే నినాదంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, బోధన, పరీక్షలు, సమీక్షలతో బిజీ బిజీగా గడుపుతున్నారు. అనంతపురం జిల్లాలో 32 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు 8960 మంది విద్యార్థినీలు చదువుతున్నారు. విద్యార్థినులలో క్రమశిక్షణతో కూడిన అధ్యయన అలవాటును పెంపొందించేందుకు ప్రత్యేక దినచర్యను అమలు చేస్తున్నారు. తెల్లవారుజామున 5.30 గంటలకే స్టడీ అవర్స్ ప్రారంభమవుతాయి. అనంతరం చదివిన అంశాలపై పరీక్ష నిర్వహిస్తారు. పాఠశాల తరగతులు పూర్తయ్యాక సాయంత్రం, రాత్రి మరో రెండు విడతలుగా ప్రత్యేక అధ్యయనాన్ని

నిర్వహిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు ఐదు గంటల అదనపు అధ్యయన సమయాన్ని విద్యార్థినులు వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయుల కీలక పాత్ర : విజయపథంలో ఉపాధ్యాయుల పాత్ర మరింత కీలకంగా మారింది. సాధారణ బోధనతో పాటు ఉదయం, రాత్రి స్టడీ అవర్స్ నిర్వహించడం, ప్రతిరోజూ స్లిప్ టెస్టులు, డిక్టేషన్‌లు నిర్వహించడం, వారానికోసారి గ్రాండ్ టెస్టులు నిర్వహించడం, జవాబు పత్రాలను సకాలంలో మదింపు చేయడం, ప్రతి విద్యార్థిని పురోగతిని నమోదు చేసి విశ్లేషించడం వంటి బాధ్యతలను వారు నిరంతరం నిర్వర్తిస్తున్నారు. దీంతో మిగతా 3లో..

చిన్నారి పెళ్లి కూతురు

- టెన్త్ విద్యార్థినికి వివాహం
- మెడలో తాళి, కాళ్లలో మెట్టెలతో స్కూల్ కు హాజరు
- వారం కిందట పెళ్లి - ఆలస్యంగా వెలుగులోకి
- అయినా స్పందించని జిల్లా విద్యా, ఐసీడీఎస్, ఇతర శాఖల అధికారులు

అనంతపురం క్రైమ్ జులై 6 ప్రభాతవార్త

పట్టుమని పదిహేనేళ్లు లేవు. చదువుకునేందుకు పదో తరగతిలోకి అడుగుపెట్టిందో.. లేదో.. అప్పుడే పెళ్లి పీటలెక్కింది ఓ పదో తరగతి విద్యార్థిని. మెడలో తాళిబొట్టు, కాళ్ళల్లో మెట్టెలతో తరగతులకు హాజరు కావడం సంచలనంగా మారింది. ఈ ఘటన అనంతపురం జిల్లా కర్ణాటక సరిహద్దుల్లోని ఓ రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థిని కావడం గమనార్హం. వారం రోజుల కిందట పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. పెళ్ళయ్యాక బాలిక చదువుపై మక్కువతో మళ్ళీ తరగతులకు హాజరవుతుండడంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. అయితే ఈ విషయం ఇంతవరకు జిల్లా విద్యాశాఖ ఇంచార్జ్ అధికారి, రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీసు అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం.

పెద్దమల్లేపల్లిలో భారీ చోరీ

- రూ.15.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

యల్లనూరు, జూలై 6 ప్రభాతవార్త

యల్లనూరు మండలం పెద్ద మల్లేపల్లి గ్రామంలోని సుంకర వెంకటరమణ అనే వ్యక్తి ఇంటిలో ఆది వారం రాత్రి భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగల గొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో వున్న దాదాపు 17.45 తులాల (పెళ్లి గొలుసులు, బంగారు గొలుసులు, ఉంగరాలు, చెవిపోగులు, చెవి గొలుసులు, కారు కలవరాలు, ముక్కుపుడకలు) బంగారు ఆభరణాలతో పాటు దాదాపు 32 తులాల వెండి ఆభరణాలు (వెండి కాలి గజ్జెలు)తో పాటు 1.30 లక్షల నగదును అపహరించించారు. బంగారం, వెండి ఆభరణాల విలువ దాదాపు 13,82,350 రూపాయలు కాగా, నగదుతో కలిపి మొత్తం 15,12,350 రూపాయల మేర చోరీకి గురైనట్లు బాధితుడు సుంకర వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామాంజనేయరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పుట్లూరు సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డిలు బాధితుని నివాసానికి చేరుకుని చోరీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుల



బీరువాలోని వస్తువులు చిందరవందర చేసిన దృశ్యం

బాధితున్ని వివరాలు తెలుసుకుంటున్న సిఐ, ఎస్ఐలు

కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే యల్లనూరు ఎస్ఐ 9440901889, పుట్లూరు సిఐ 9440796862 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన చీకలగురిక రోడ్డు

వంతెన శిథిలమైన దృశ్యం

అధ్వాన్నంగా ఉన్న మరొక వంతెన

ఒక వంతెన కట్టడం మధ్యలో పడిన గుంతలో రాళ్లు, మట్టి వేసిన దృశ్యం

రోడ్డు నిర్మించారు..

వంతెనల నిర్మాణం మరిచారు..!

-భారీ వర్షాలు కురిసినపుడు వంకల నీటితో తప్పని ఇబ్బందులు
-చీకలగుర్కి రోడ్డులో శిథిలావస్థకు చేరుకున్న రెండు వంతెనలు
-కొత్త వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం చొరవచూపాలంటున్న ప్రజలు

ఉరవకొండ, జూలై 6 ప్రభాతవార్త

నూతన రోడ్డును నిర్మించి వంతెనల నిర్మాణం గురించి విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. ఉరవకొండ మండల పరిధిలోని బూదగవి గ్రామంవద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారి నుండి విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామానికి 5 నెలల క్రితం పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నాబార్డు నిధులు 1.50 కోట్ల రూపాయల వ్యయంతో నూతన రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే 3.5 కిలోమీటర్ల రోడ్డులో రెండు ప్రధాన వంతెనలు శిథిలావస్థకు చేరుకొని ప్రజలు ఇబ్బందులు పడుతుండగా వాటిని పునర్ నిర్మించడానికి మాత్రం అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎప్పుడు భారీ వర్షాలు కురిసినా వంతెనలు దాటి రాకపోకలు సాగించడానికి వీలులేకుండా పోతోందని వర్షపునీరు వంతెనల పైనుండి ప్రవహిస్తాయని గ్రామ ప్రజలు చెబుతున్నారు. రోడ్డు వేసే సమయంలో నూతన వంతెనల నిర్మాణం కూడా చేపట్టి ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని అంటున్నారు. ఇప్పుడున్న వంతెనల ఎత్తు తక్కువగా ఉండి పలుచోట్ల కట్టడాలు ధ్వంసమైన రాళ్లు, కడ్డీలు తేలాయని వర్షాలు వచ్చినపుడు వాటి పైనుండి జాగ్రత్తలు పాటించకుండా ప్రయాణిస్తే ప్రమాదాలకు గురికాక తప్పదని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నూతన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు.

సమాచార శాఖ, డిపిఆర్ఓ గా బాధ్యతలు చేపట్టిన వై.ప్రభాకర్

అనంతపురం కలెక్టరేట్ జులై 6 ప్రభాతవార్త

జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో డిపిఆర్ఓగా వై. ప్రభాకర్ సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారని డిఐపిఆర్ఓ బాలకొండయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపిఆర్ఓ ప్రభాకర్ నంద్యాల జిల్లాలో డివిజనల్ పిఆర్ఓగా పనిచేస్తూ పదోన్నతి పై శ్రీయుత డైరెక్టర్ సమాచార మరియు పౌర సంబంధాల శాఖ విజయవాడ వారి ఉత్తర్వులు మేరకు సోమవారం అనంతపురం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయంలో డిఐపిఆర్ఓ గా బాధ్యతలు చేపట్టారు.

ఎన్నో ఏళ్ల నాటి కల సాకారం.. విద్యార్థినుల కళ్లలో ఆనందం విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

4 >>

సర్ ప్రక్రియను పరిశీలించిన డిడబ్ల్యూఎంఎ పిడి సలీం బాషా

బెళుగుప్ప జూలై 6ప్రభాత వార్త

బెలుగుప్ప, ఎర్రగుడి, సీర్పి గంగవరం దుద్దెకుంట గ్రామ పంచాయతీ లో SIR కార్యక్రమంపై డిడబ్ల్యూఎంఎ పిడి సలీం భాష, సందర్శించి బిఎల్ఓ, బిఎల్ఎ సచి వాలయం సిబ్బంది, FAsmates, ఇతర dept వారితో రివ్యూ చేసి 3 రోజుల లోపల పూరి అయ్యేటట్లు చేయాలి అని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ప్రతి అర్హత కలిగి ఉన్న వారందరికీ ఓటు హక్కు ఉండవలసిన బాధ్యత ఉన్నది. ఈ విషయం ప్రతి ఇంటిలో సభ్యునికి తెలియ చేసి గ్రామంలో అర్హత కలిగి ఉండి ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని చెప్పడం జరిగింది.

ఆరోగ్యవంతమైన వాతావరణం లో జీవిద్దాం

తాగునీటి కుళాయి వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వైద్య బృందం

డి.హిరెహాళ్ జులై 6 ప్రభాతవార్త

ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు సహకరించి ఆరోగ్యవంతమైన వాతావరణంలో జీవించేందుకు చేయి చేయి కలుపుదామని వైద్యాధికారి శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం డి.హిరెహాళ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మడేనహల్లి గ్రామంలో వైద్య బృందంతో కలిసి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలో భాగంగ పరిశుభ్రత (శానిటేషన్) కార్యక్రమం చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించా నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని పలు అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు శివకుమార్, రమణ, ఎంఎల్‌హెచ్‌పీ భువనేశ్వరి, ఆశా వర్కర్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

బూత్ స్థాయి అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంత బాబు

కంబదూరు, జూలై 6, ప్రభాత వార్త

ప్రత్యేకఓటర్ల జాబితా సమగ్రసవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా చేపట్టాలని కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డీవో వసంత బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కంబదూరు మండలం నూతిమడుగు పరిధిలోని పోలింగ్ కేంద్రాలు 242, 245 లో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ పనుల్లో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని బూత్ స్థాయి అధికారులు బీఎల్ఓలకు సూచించారు. ప్రతి బీఎల్ఓ రోజుకు కనీసం 50 ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్ల నుంచి స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిశీలించి డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ బాలకిషన్ ఉన్నారు.

ఆకస్మిక తనిఖీలో ఆరోగ్య సేవలపై అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో దృష్టి

గర్భిణులకు అన్ని పరీక్షలు తప్పనిసరి చేయాలి

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణకు ఆదేశాలు

కుష్టు, క్షయ, హెచ్ఐవీ రికార్డుల పరిశీలన

శెట్టూరు, జులై 06 ప్రభాతవార్త

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య అధికారులు

జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ జయలక్ష్మి జిల్లా పారామెడికల్ అధికారి నాగన్నతో కలిసి శెట్టూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వైద్య సేవలు, వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గత ఏడాది నుంచి నమోదైన కుష్టు వ్యాధి, క్షయ వ్యాధి, హెచ్ఐవీ/ఎయిడ్స్ చికిత్సకు సంబంధించిన వివరాలు, గర్భిణుల హైరిస్క్ కేసుల రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ నిఖితతో మాట్లాడుతూ, పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి గర్భిణికి అవసరమైన అన్ని రక్త పరీక్షలు నిర్వహించాలని, ముఖ్యంగా హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. గర్భిణుల నమోదు జరిగిన వెంటనే వారి పూర్తి వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని, అభా (ఏబీహెచ్ఏ) ఐడి ఉన్న వారినే గర్భిణులుగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షిత ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అలాంటి గర్భిణులను తరచూ వైద్య పరీక్షలకు తీసుకువెళ్లి సురక్షిత ప్రసవం జరిగేలా చూడటం సంబంధిత ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా పారామెడికల్ అధికారి నాగన్న, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, సూపర్వైజర్ మునెమ్మ, హెల్త్ అసిస్టెంట్ మహమ్మద్ ఘౌస్, స్టాఫ్ నర్స్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా గుత్తి కుర్రాడు భువనేశ్వర్ ఎంపిక

గుత్తి, జూలై 6 ప్రభాతవార్త

జిల్లా జట్టు కెప్టెన్‌గా ఎంపికైన భువనేశ్వర్ (ఫైల్‌ఫోటో)

అనంతపురం జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా గుత్తికి చెందిన భువనేశ్వర్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంపిక చేసింది. నేటి నుండి ఈనెల 24 వరకు కడపలో జరగనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో భువనేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా జట్టు తలపడనుంది. అతని ప్రతిభను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, కోచ్ ఆర్.కుమార్ జోషి, క్రీడాకారులు, తదితరులు అభినందించారు.

రెండవ విడత భూసేకరణ

రైతులతో మాట్లాడుతున్న తహసిల్దార్ వెంకటేష్, ఆర్,ఐ అమర్

హిందూపురం టౌన్ జూలై 06 ప్రభాతవార్త

హిందూపురం మండలం మలుగూరు గ్రామంలో రెవెన్యూ పరిధిలో రెండవ విడత భూసేకరణ పనులను హిందూపురం తహసిల్దార్ వెంకటేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అమరేంద్రలు సోమవారం చేపట్టారు. ఈ మేరకు తహసిల్దార్ వెంకటేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అమరేంద్రలు మలుగూరు సమీపంలోని గ్రామాలలో భూసేకరణ కొరకు రైతులతో సమావేశమయ్యారు. మొదటి విడతలో 563 ఎకరాలు సేకరించగా రెండవ విడతలో 1000 ఎకరాలు సేకరణ చేపడుతున్నట్లు ఎమ్మార్వో తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న భూములకు సంబంధించి ఎకరాకు 12.75 లక్షలు పరిహారం చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భూ సేకరణ పనులు వేగవంతంగా జరుగుతాయని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. రైతుల దీనికి సహకరించాలని కోరారు.

ఎస్ ఐ ఆర్ ను వేగవంతం చేయండి స్టేట్ డైరెక్టర్ నీల స్వామి

ఎస్ఐఆర్ ను పరిశీలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం జూలై 6 ప్రభాతవార్త

మండలం పరిధిలోని గుండి గాని పల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా కురవ కార్పొరేషన్ డైరెక్టర్ నీల స్వామి స్థానిక నాయకులతో కలిసి ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ కార్యక్రమంలో పాలు పంచుకొని ప్రతి ఒక్కరు తమ ఓటు ఎక్కడ ఉందో తెలుసుకొని ఓటర్ల జాబితాలో పేర్లను సరి చేసుకోవాలని సచివాలయ ఉద్యోగులుస్తులతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాగిరెడ్డి కురుమల్లి బొజ్జన్న రామచంద్రప్ప పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

చిలమత్తూరు, జూలై 6 ప్రభాతవార్త

ఉరి వేసుకున్న మంజునాథ్

కుటుంబకలహాలతో చిలమత్తూరు బిసి కాలనీకి చెందిన మంజునాథ్ (29) అనే యువకుడు సోమవారం ఉదయం చిలమత్తూరు శివారులో వున్న కనుమ అటవీప్రాంతంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్ని నెలలుగా కుటుంబం విషయంలో బాధపడుతున్న మంజునాథ్ విరక్తి చెంది రేగు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్యతో పాటు సంవత్సరం బాబు వున్నారు. మంజునాథ్ టిప్పర్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా మారిన కుమారుని మృతదేహాన్ని చూసి తల్లి విలపించిన తీరు వర్ణణాతీతం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిలమత్తూరు పోలీసులు తెలిపారు.

లేపాక్షిలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

-ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి

-ఆయూష్ డాక్టర్ సాహితి

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాహితి

లేపాక్షి, జూలై 6 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షిలో సోమవారం ఆయూష్ వైద్యాధికారి సాహితీ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మందికి పైగా రోగులు పాల్గొన్నారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాహితీ మాట్లాడుతూ లేపాక్షిలో పలువురు రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులతో వచ్చారన్నారు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేయడం జరిగిందన్నారు. అన్ని వ్యాధులకు అవసరమైన మందులు ఆయుర్వేద వైద్యశాలలో ఉన్నాయన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ఆయుర్వేద ఆసుపత్రికి రావాలని రోగులకు, వృద్ధులకు సూచించారు. వ్యాధి ప్రారంభ దశలో ఆసుపత్రికి వస్తే పూర్తిగా నయమయేందుకు అవకాశం ఉందన్నారు. ప్రాచీన ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య సహాయకులు ఇరగంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ బుక్స్ పంపిణీ చేసిన తహసీల్దార్ అనిల్ కుమార్

బెళుగుప్ప జూలై 6ప్రభాత వార్త

దుద్దేకుంట గ్రామ రైతులకు పట్టాదార్ పాస్‌బుక్స్ పంపిణీబెలుగుప్ప మండలంలోని దుద్దేకుంట గ్రామంలో ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన పట్టాదార్ పాస్‌బుక్స్ దుద్దెకుంట గ్రామ పొలంకు సంబంధించి మొత్తం 1021 పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చివున్నవి, పంపిణీలో భాగంగా మొదటి రోజు సుమారు 350 పట్టాదారు పాస్‌బుక్స్‌ను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెలుగుప్ప తహసీల్దార్ (అనిల్ కుమార్) గారు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ పెద్దన్న గారు, స్థానిక నాయకులు తిమ్మప్ప గారు , గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం రైతులకు నూతన పట్టాదార్ పాస్‌బుక్స్‌ను పంపిణీ చేసి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భూ రికార్డులను మరింత పారదర్శకంగా, సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో నూతన పట్టాదార్ పాస్‌బుక్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రైతులు తమ భూ వివరాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

దివ్యాంగులపై కలెక్టర్ కరుణించాడు

- గోరంట్ల మండల దివ్యాంగులకు వీల్ చైర్లు, హియరింగ్ మిషన్లు అందజేత

గోరంట్ల, జూలై 6 ప్రభాతవార్త

దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న కలెక్టర్

మట్టవర్తిలోని రెవెన్యూ భవన్‌లో గల ఎస్.ఆర్. హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపింది. గ్రీవెన్స్ వినతులు స్వీకరించే సమయంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మానవత్వంతో స్పందించి నలుగురు దివ్యాంగులకు అక్కడికక్కడే అవసరమైన సహాయక ఉపకరణాలను అందజేశారు.

వీల్ చైర్ల పంపిణీ : గోరంట్ల మండలం డి.గంగంపల్లి తండాకు చెందిన జితేంద్రనాయక్ కుమారుడు వినోద్‌కుమార్‌కు వీల్ చైర్ అందజేశారు. అదే గ్రామానికి చెందిన జితేంద్రనాయక్ కుమార్తె భగవత్ పవిత్రబాయికి కూడా వీల్ చైర్ అందజేశారు.

హియరింగ్ మిషన్లు పంపిణీ : గోరంట్ల మండలం రాజీవ్ కాలనీకి చెందిన తోటల వెంకటేష్ కుమారుడు బధిర దివ్యాంగుడైన టి.వినయ్‌కు శ్రవణ యంత్రాన్ని అందజేశారు. సోమందేపల్లి మండలం, బ్రహ్మసముద్రం ఆనంధపురం గ్రామానికి చెందిన హనుమంతరాయుడు కుమారుడు వెంకటేశులుకు శ్రవణ యంత్రాన్ని అందజేయడం జరిగింది. తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వెంటనే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా అక్కడికక్కడే స్పందించి వీల్ చైర్లు, హియరింగ్ మిషన్లు అందజేసిన జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకున్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే బాధితుల పట్ల కలెక్టర్ చూపిన చొరవ, మానవతా దృక్పథంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చన, పాల్గొన్నారు.

ఓటర్ల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

గుత్తి, జూలై 6 ప్రభాతవార్త

హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసిన దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ఓటర్లకు సర్ ఓటర్ జాబితా సవరణ పట్ల అవగాహన కల్పించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి, హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది వాటికి పరిష్కారం చూపుతారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. అనంతరం కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు తప్పనిసరి చేయించుకోవాలి మండల వ్యవసాయ అధికారి మహేష్

కంబదూరు, జూలై 6, ప్రభాత వార్త

రైతులతో మాట్లాడుతున్న ఏవో మహేష్

పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. సోమవారం కంబదూరు మండలం అండేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, పంట నమోదు ఆధారంగానే ఎరువుల పంపిణీ, పంటల బీమా, మద్దతు ధర, రాయితీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు జరుగుతుందని వివరించారు. అందువల్ల ప్రతి రైతు తన సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే ఏపీ ఏఐఎంఎస్ విధానం ఆధారంగానే ఎరువుల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. వేరుశనగ పంటలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, పంట సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు మోనికతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండలో ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన దళిత నాయకులు

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ, జూలై 6 ప్రభాతవార్త

భారతదేశ తొలి ఉప ప్రధాని, స్వతంత్ర సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సోమవారం ఉరవకొండ పట్టణంలో ఘనంగా జరిగింది. డిజిహెచ్ఎస్ వ్యవస్థాపకులు మీనుగ గోపాల్ ఆధ్వర్యంలో దళిత నాయకులు క్లాక్ టవర్ కూడలిలో గల డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిజిహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపకులు మీనుగ గోపాల్, గుత్తికు చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్, బీఎస్పీ నాయకుడు బండ్ల రామాంజినేయులు తదితరులు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయ పరిరక్షకులని ఆయన స్వాతంత్ర సమరయోధుడిగా, ఉప ప్రధానిగా, ఉత్తమ పార్లమెంటేరియన్ గా దేశానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్మిక, వ్యవసాయ మంత్రిగా ఎన్నో పదవులు అలంకరించి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహా నాయకుడని ఆయన ఆశయ సాధనకు పాటుపడడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు అడవిరాముడు, శివశంకర్, రామాంజినేయులు, లాలు అంజి, బీఎస్పీ గుత్తి మండల నాయకులు బండల రామాంజినేయులు, ఉరవకొండ దళిత నాయకులు ముష్టూరు ఎర్రిస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు వెలిగొండ ఓబన్న, పీసీ ఫ్యామిలీ బీమా, టి.కృష్ణ , కృష్ణ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 1,20,843 ఈఎఫ్‌లు డిజిటలైజేషన్ పూర్తి

- అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి వి.మల్లికార్జునరెడ్డి

- బీఎల్‌వోలకు ఓటర్లు, బీఎల్‌ఏలు సహకరించాలన్న ఈఆర్‌వో

బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో మాట్లాడుతున్న తహశీల్దార్ పి.జి.అరుణ

ఉరవకొండ, జూలై 6 ప్రభాతవార్త

ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,20,843 మంది ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్‌వో యాప్‌లో డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిందని అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి సోమవారం తెలిపారు. గతనెల 15వ తేదీ నుండి ప్రారంభమైన సర్-2026 ఇంటింటి సర్వేలో భాగంగా బీఎల్‌వోలు బీఎల్‌ఏలతో సమన్వయం చేసుకొని నియోజకవర్గంలోని 260 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 2,26,187 మంది ఓటర్లకుగాను 2,22,535 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించడం జరిగిందన్నారు. ఓటర్లు పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలకు పాస్‌పోర్టు సైజు ఫోటోలను జతచేసి బీఎల్‌వోలకు అందజేయాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు బీఎల్‌వోలకు అప్పగించకుంటే వారి పేర్లు ఈనెల 21న ప్రచురించే ఓటరు జాబితా డ్రాఫ్ట్ లిస్టులో నమోదు కావన్నారు. డ్రాఫ్ట్ లిస్టులో పేరులేని వారి నుండి ఓటరు నమోదుకై ధరఖాస్తులు స్వీకరించి విచారణ అనంతరం అర్హులను సెప్టెంబర్ 22న ప్రచురించే తుది ఓటరు జాబితాలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఓటరు వారి ఇంటి నుండే వారి ఎన్యుమరేషన్ ఫారం వివరాలను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఈఆర్‌వో వివరించారు. కాగా సోమవారం మండల తహశీల్దార్ పి.జి.అరుణ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరుగుతున్న సర్వే, ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. తహశీల్దార్ వెంట ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.

అధికమవుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయం..!

-సరఫరా ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి

-తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉరవకొండ, పరిసర ప్రాంత ప్రజలు

-విపరీతమైన ఈదురు గాలులే కారణమంటున్న విద్యుత్ అధికారులు

ఉరవకొండ, జూలై 6 ప్రభాతవార్త

విద్యుత్ సరఫరాలో అదికారుల అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరఫరా ఎప్పుడు ఉంటుందో..ఎప్పుడు పోతుందో కూడా తెలియని దుస్థితులు నెలకొన్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. రోజుకు పదుల సార్లు సరఫరా నిలిచిపోతుండం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉరవకొండ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో సమస్యలు చాలా కాలంగా ఉన్నా గడిచిన వారం రోజులుగా ఈదురు గాలులు అధికారం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోంది. వేసవిలో కంటే ఎక్కువగా కోతలు అధికం కావడం, సరఫరా వచ్చినా లో ఓల్టేజీ లేక హై ఓల్టేజీతో విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో ఇళ్లలోని విద్యుత్‌తో నడిచే సామాగ్రి కాలిపోయి నష్టపోవాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరాతోనే నడిచే వ్యాపారాలు, టిఫిన్, భోజన హోటళ్లు మూసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉరవకొండలో చిరుజల్లులు కురిసినా, గాలి వీచినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే సమస్య సంవత్సరాల కాలంగా కొనసాగుతున్నా దాన్ని పరిష్కరించడానికి విద్యుత్‌శాఖ ఎందుకు చొరవ చూపడంలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

-చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్

తాడిమర్రి జూలై 6 (ప్రభాతవార్త)

శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దేవర రామ్మోహన్

డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం శివం పల్లిగ్రామంలో జిల్లా కిసాన్ మోర్చా నాయకులు ఆర్వేటి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్త డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత సార్వభౌమాధిపత్యం, జాతీయత కోసం అహర్నిశలు కృషి చేశారని దేశంలో తొలిసారిగా హిందూ రాజకీయ పార్టీని స్థాపించి హిందువుల మనోభావాలను పతాక స్థాయిలో నిలిపారని కొనియాడారు. అలాంటి గొప్ప మహనీయుడు మన మధ్య లేకున్నా ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షాలకు దేశ ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

గుత్తిలో ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడ

03ATP06.qxd:03ATP06.qxd 07/07/26 11:33 PM Page 1

రాసాని రచనలు సామాజిక జీవితచిత్రణలు

- "స్వర్ణముఖి కథలు" పుస్తకావిష్కరణలో వక్తలు

స్వర్ణముఖి పుస్తకావిష్కరణ కార్యక్రమంలోని దృశ్యం

మాట్లాడుతున్న ఎస్కే యూనివర్సిటీ మాజీ విసి కుసుమ కుమారి

అనంతపురము, జులై 6 ప్రభాతవార్త బ్యూరో

ప్రముఖ కవి, కథకులు, నవలాకారుడు, నాటకకర్త డా.రాసాని వెంకట్రామయ్య రచనలు సామాజిక జీవిత చిత్రణలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాసాని రచించిన "స్వర్ణముఖి కథలు" పుస్తకావిష్కరణ సభ సోమవారం పౌర గ్రంథాలయ శాఖ, విమలాశాంతి సాహిత్య, సాంఘిక, సాంస్కృతిక సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సాగింది. జిల్లా కేంద్ర గ్రంథా లయ సంస్థ సమావేశ మందిరంలో జరిగిన సభకు ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు.

ముఖ్య అతిథిగా మాజీ విసి ప్రొ.కుసు మకుమారి హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ మార్క్సిస్ట్ విమర్శ కులు భూమన్, ప్రముఖ రచయిత డాక్టర్ శాంతి నారాయణ హాజ రయ్యారు. ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు తూముచర్ల రాజారామ్ విశి ష్ట అతిథిగా హాజరై పుస్తక సమీక్ష చేశారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ప్రముఖ కవి సాహిత్య విమర్శ కులు కొత్వాలు అమరేంద్ర ఆప్త వాక్యం పలి కారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రాసాని పరిశో ధనాత్మకంగా "ఆదియో ధుడు" ,"వొలికెల బీడు", "ముద్ర", "బతుకాట", "వలస", "పరస" "నరమేధం", "నేలతీపి", "తరి గొండ వెంగ మాంబ", "చెంచిత", "మెరవణి", "ముల్లుగర్ర", "నాలుగో నాటకం", "రక్త చందనం" వంటి అనేక కథలు, నవలలు, నాటకాలు వెలు వరించారని చెప్పా రు. ద్రవిడ సమాజపు లోతులకు వెళ్లి, పరిశోధనలు చేసి, తెలుగు సాహి త్యానికి గొప్ప నవలలు, నాటకాలు, కథలను అందించిన రాసాని అభినంద నీయుడన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు, డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ ఈ. కమలాకర్, షహనాజ్, తరిమెల అమరనాథ రెడ్డి, డా.మల్లికార్జున, వంకిరెడ్డి రెడ్డెప్పరెడ్డి, కమ్మన్న, టివి రెడ్డి, డా.జూటూరి షరీఫ్, షేక్ రియాజుద్దీన్, గుంటి మురళీకృష్ణ భరద్వాజ్, సోమర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్న రావణ్, కేవీ రెడ్డిపై అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి

- భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులను ఖండిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సంతోష్ కుమార్

అనంతపురం న్యూటౌన్, జులై 6 ప్రభాతవార్త

అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి, యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చలకూరి జోసెఫ్ (ప్రశ్న రావణ్), ప్రముఖ జర్నలిస్టు, డిజిటల్ మీడియా నిర్వాహకుడు కేవీ రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులు, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తు న్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రశ్న రావణ్‌ను కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు ఒక కేసులో అరెస్టు చేసి, న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిన వెంటనే మరో కేసు పేరుతో తిరిగి అదుపులోకి తీసుకోవడం చట్టబద్ధ పాలనకు విరుద్ధమని ఏఐవైఎఫ్ పేర్కొంది. వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తీసుకువచ్చిన సమయంలో ఆయనపై జనసేన కార్యకర్తలు దాడికి దిగడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తెలిపింది. ఈ ఘటనలో బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అదేవిధంగా, కేవీ రెడ్డి తన డిజిటల్ మీడియా వేదికలో రాష్ట్ర రాజకీయాలు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు సంబంధించిన అంశాలపై రాజకీయ విశ్లేషణ చేసినందుకే పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధ మని ఏఐవైఎఫ్ ఆరోపించింది. ప్రశ్నించే స్వరాలపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రశ్న రావణ్, కేవీ రెడ్డిపై ఉన్న కేసులను ఎత్తివే యా లని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రభు త్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని డిమాం డ్ చేశారు. అరెస్టులు, వేధింపుల విధానా న్ని వెంటనే నిలిపివే యాలన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజాతంత్ర వాదులు, ప్రజాసంఘాలు, యువజను లు, మేధావులు ఐక్యంగా ముం దుకు రావాలని పిలుపునిచ్చారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సంతోష్ కుమార్

నిరంతర విద్యుత్ సరఫరా చేయండి

- ఎద్దులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రైతుల ధర్నా

పామిడి, జులై 06 ప్రభాతవార్త

త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా లేకపోవటంతో అటు త్రాగునీరు ఇటు సాగునీరు నిలిచిపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఎద్దులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిదిలోని ఎద్దులపల్లి, రామగిరి, రామగిరి ఎగువ, దిగువతండా, దిబ్బసానిపల్లి, కట్టకిందపల్లి గ్రామాల రైతులు ప్రజలు డిమాండ్ చేశారు. మండల పరిదిలోని ఎద్దులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు సోమవారం ధర్నా చేపట్టారు. గత వారం రోజుల నుండి త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పటికీ సంబందిత అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు.

త్రాగునీటి కోసం ప్రజలు సాగునీటి కోసం రైతులు యాచించాల్సిన దుస్థితి నెలకొందని పరిస్థితి ఇలానే కొనసాగితే సమస్య మరింత జఠిలం అయ్యే ప్రమాదం ఉందన్నారు. త్రీ ఫేస్ ద్వార నిరంతర విద్యుత్ సరఫరా చేస్తూనే రామగిరి ఫీడర్ కిందు మూడేళ్ళుగా ఖాలీ గా ఉన్నటు వంటి సీనియర్, జూనియర్ లైన్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని లేనిపక్షంలో ఆందో ళన కార్యక్రమాలను చేపడుతా మని హెచ్చరించారు.

ఎద్దులపల్లి సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న రైతులు

ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

అనంతపురం న్యూటౌన్, జులై 6 ప్రభాతవార్త

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అందులో ముఖ్యంగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే ముఖ హాజరుపై వెనక్కి తగ్గకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని భవిష్యత్తులో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. తక్షణమే హాస్టల్లో ఉన్నటు వంటి విద్యార్థులకు మెస్ ఛార్జీలు మూడువేల రూపాయలకు పెంచే లా చర్యలు తీసుకోవాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సూర్య ప్రకాష్, అరుణ్ రషీద్, వంశి, రాజేష్, గణేష్, సాయి, వంశి, విద్యార్థులు మహేష్, ధరణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యూట్యూబ్ ప్రశ్న రావణ్, కేవీ రెడ్డి అరెస్టులు ఆక్రమం - కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి

అనంతపురం కల్చరల్, జులై 6 ప్రభాతవార్త

యూట్యూబర్ ప్రశ్న రావణ్, కేవీ రెడ్డిల అరెస్టును జర్నలిస్ట్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండించిన స్మాల్ మీడియం డైలీ న్యూస్ పేపర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా మీడియాకు జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా ఆయన సోమ వారం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి తమ అభిప్రా యాలను వ్యక్తీకరించే హక్కు ఉందని, చట్టబద్ధమైన కారణాలు లేకుండా అరె స్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం చట్టాన్ని నిష్పాక్షికంగా అమలు చేయాలని, అరెస్టుల విషయంలో పారదర్శకత పాటించాలని ఆయన కోరారు. ప్రశ్న రా వణ్, కేవీ రెడ్డిలపై చట్టపరమైన చర్య లు ఉంటే వాటిని న్యాయపరంగా ముం దుకు తీసుకెళ్లాలని, అక్రమ అరెస్టుల కు తావు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య విలు వలను పరి రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.

కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి (ఫైల్ ఫోటో)

పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు

గార్లదిన్నె: జులై 6 ప్రభాతవార్త

జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గార్లదిన్నె పశువైద్య కేంద్రంలో సోమవారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పశువులు, పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోసిస్ వ్యాధులుగా పేర్కొన్నారు. రేబిస్ వైరస్ వల్ల వచ్చే వ్యాధికి చికిత్స లేదని, ముందుజాగ్రత్తగా ప్రతి ఏడాది పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా వేయించడం తప్పనిసరని సూచించారు. రైతులు, పెంపుడు జంతువుల యజమానులు ప్రభుత్వ ఉచిత టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు రాఘవి, ఖదిరున్, నల్లప్పతో పాటు పలువురు పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు రేబిస్ టీకా వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ రమేష్..

ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ లో పదోన్నతులు

అనంతపురం న్యూటౌన్, జులై 6 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా సోషల్ వెల్ఫేర్ లో గ్రేడ్ 2 వార్డెన్లుగా పనిచేస్తున్న నాగలక్ష్మి, వాణి శైలజలకు గ్రేడ్1 పదోన్నతులు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఈనెల 5న ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగిగా పనిచేస్తున్న స్రవంతికి జూనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వు లు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు ఉద్యోగికి అందజేశారు. ఈ సందర్భంగా ఈ ఉద్యోగులకు పలువురు అధికారులు, ఉద్యోగులు, వార్డెన్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడాపోటీలు విజయవంతానికి పూర్తి సహకారం అందించాలి

సమావేశం నిర్వహిస్తున్న ఎంపిడిఒ అలివేలమ్మ

బిఎల్ఒలతో మాట్లాడుతున్న ఇఆర్ఒ కిరణ్మయి

పుట్లూరు, జూలై 6 ప్రభాతవార్త

క్రీడా పోటీలను విజయవంతం చేయడానికి ప్రతి పాఠశాల పూర్తి సహకారం అందించాలని ఎంపిడిఒ అలివేలమ్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి క్రీడా ఛాంపియన్‌షిప్‌పై ఎంఇఒలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి క్రీడా ఛాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్-14 బాలికలకు ఈ నెల 14న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అండర్-14 బాలురకు ఈ నెల 15న పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయి విజేతలకు నియోజకవర్గం స్థాయికి, అక్కడ గెలుపొందిన వారికి జిల్లా స్థాయికి అవకాశం వుంటుందన్నారు. ఈ క్రీడాపోటీలను విజయవంతం చేయడానికి ప్రతి పాఠశాల పూర్తి సహకారం అందించాలని ఎంపిడిఒ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 శ్రీదేవి, ఎంఇఒ-2 ప్రేమ్‌కుమార్, పుట్లూరు జెడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, కడవకల్లు జెడ్‌పిహెచ్ఎస్ పిడి గంగరాజు, కెజిబివి పిడి శివజ్యోతి, శ్రీరామ గ్లోబల్ స్కూల్ పిడి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రిఅర్బన్, జూలై 6 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ముందు సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతునికి 35 నుండి 40 సంవత్సరాల వయసు వుంటుందని ఎత్తు 5.5 అడుగులు వుంటాడని మృతుని శరీరంపై చామనచాయ లైన్ల తెల్ల కలర్ చొక్కా, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి వున్నాడని మృతునికి కొంచెం బట్టతల వున్నట్లు పోలీసులు తెలిపా రు. మృతుని ఆచూకి తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

45 రోజుల్లో రూ.29 లక్షల విలువైన 141 మొబైల్ ఫోన్ల రికవరీ

(మొదటి పేజీ తరువాయి) ఆధారంగా ఫోన్లను గుర్తించి రికవరీ చేసినట్లు తెలిపారు. గత ఐదు నెలల్లో మొత్తం 270 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేయడం జరిగిందన్నారు. మొబైల్ ఫోన్‌ను ఎల్లప్పుడూ భద్రంగా ఉంచుకోవాలని, బస్టాండ్లు, మార్కెట్లు, షాపింగ్ ప్రాంతాలు, బస్సు ప్రయాణాల్లో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని సూచించారు. బిల్లు లేదా సరైన పత్రాలు లేని సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయరాదని హెచ్చరించారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. పండుగలు లేదా ఇతర అవసరాల కోసం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే వారు లాకింగ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. కనీసం ఒక రోజు ముందుగానే యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందితే, పోలీసు సిబ్బంది ఇంటి వద్ద సెన్సార్ కెమెరాలను ఏర్పాటు చేస్తారని వివరించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కెమెరా ముందు ఏదైనా కదలిక జరిగిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు అలారం చేరుతుందని, ఆ సమాచారం అందిన వెంటనే సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు బృందాలు అప్రమత్తమై మూడు నుంచి నాలుగు నిమిషాల్లో ఘటనాస్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఇంటి దొంగతనాలను సమర్థవంతంగా నివారించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సేవ కోసం ప్రజలు ప్రత్యేకంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాల్సిన అవసరం లేదని, యాప్ ద్వారా సమాచారం ఇవ్వడమే సరిపోతుందని స్పష్టం చేశారు. కాగా తమకు ఎంతో విలువైన మొబైల్ ఫోన్లు తిరిగి అందడంతో 141 మంది బాధితులు జిల్లా ఎస్పీకి, సైబర్ క్రైమ్ విభాగానికి, క్యాట్ టీం పోలీస్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీలో విశేష కృషి చేసిన ఐటీ కోర్-సైబర్ క్రైమ్ క్యాట్ టీం విభాగం, సీఐలు గోపీనాథ్ రెడ్డి, సతీష్ కుమార్, పోలీస్ సిబ్బంది చంద్ర, శ్రీనివాసులు, షమీర్, సీసీఎస్ సిబ్బంది కృష్ణానాయక్, నరసింహమూర్తి తదితరులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అంకిత, సైబర్ క్రైమ్ సీఐ గోపీనాథ్ రెడ్డి, క్యాట్ టీం, సోషల్ మీడియా సిబ్బంది, మొబైల్ ఫోన్లు పొందిన బాధితులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో మొదలైన విజయపథం...!

(మొదటి పేజీ తరువాయి) కేజీబీవీల్లో ఉపాధ్యాయులు కూడా విద్యార్థినులతో సమానంగా బిజీగా ఉంటున్నారు.ప్రతి సోమవారం గ్రాండ్ టెస్ట్: పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ప్రతి సోమవారం 100 మార్కుల గ్రాండ్ టెస్ట్, ఆరో నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థినులకు ప్రతి మంగళవారం గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. మిగిలిన పనిదినాల్లో స్లిప్ టెస్టులు, డిక్టేషన్‌ల ద్వారా రోజువారీ అభ్యసనాన్ని అంచనా వేస్తున్నారు. పరీక్షల ఫలితాలను ప్రత్యేక విజయపథం రిజిస్టర్‌లో నమోదు చేసి నిరంతరం సమీక్షిస్తున్నారు.ప్రత్యేకంగా విజయపథం కార్యక్రమం: విజయపథంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థినుల అభ్యసన స్థాయి వర్గీకరణ నిలుస్తోంది. ప్రతి వారాంతంలో పరీక్షల ఫలితాలను విశ్లేషించి విద్యార్థినులను ఉన్నతి (90-100), ప్రగతి (65-90), దీప్తి (40-65), స్ఫూర్తి (40 శాతం లోపు) అనే నాలుగు విభాగాలుగా వర్గీకరిస్తున్నారు. ఈ విశ్లేషణ ఆధారంగా ప్రతి విద్యార్థినికి అవసరమైన ప్రత్యేక బోధన, వ్యక్తిగత మార్గదర్శనం, అదనపు సాధన కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థినులను ముందుకు తీసుకురావడమే కాకుండా, ప్రతిభావంతులను మరింత ఉన్నత లక్ష్యాల దిశగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. విద్యార్థినుల మార్కులు మాత్రమే కాకుండా వారి అభ్యసన సామర్థం, సమయపాలన, స్వీయ అధ్యయన అలవాటు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంపై కూడా విజయపథం దృష్టి సారిస్తోంది. ప్రతి రోజు నేర్చుకున్న అంశాన్ని అదే రోజు పరీక్షల ద్వారా బలోపేతం చేయడం వల్ల అభ్యసనం మరింత స్థిరపడుతోందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.బిజీ బిజీగా టీచర్లు, విద్యార్థినీలు: జూన్ నెల నుంచే విజయపథం కార్యాచరణతో రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీలు విద్యా సందడితో కళకళలాడుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థినులు, ఉపాధ్యాయులు చదువు, బోధన, పరీక్షలు, సమీక్షలతో ..బిజీ బిజీ..గా గడుపుతూ, ఈ విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలను సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్లు అందుబాటులోకి

అనంతపురం న్యూటౌన్, జులై 6 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి/మార్చి 2026నకు సంబంధించిన ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లను సోమవారం నుండి జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కార్యాలయము నుండి పొందవచ్చునని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పేర్కొన్నారు. ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లను తీసుకొనుటకు సంబంధిత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తప్పనిసరిగా "అనుమతి పత్రము" ఇచ్చి పంపించవలసినదిగా తెలిపారు. ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లను విద్యార్థులకు జూలై 15వ తేదీలోగా అందజేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళకు తెలియజేశారు.

ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం

సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జులై 6 ప్రభాతవార్త

అనంతపురం కార్పొరేషన్‌లోని వివిధ పాఠశాలలో సమస్యల సేకరణ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్య దర్శి రామాంజనేయులు ఉపా ధ్యాయ సమస్యలపై మాట్లాడుతూ.. తక్షణమే 12వ పి.ఆర్.సి. కమిటీ వేయాలి, 30 ఐ.ఆర్. ప్రకటించాలి, పెండింగ్ డి.ఏ.లు విడుదల చేయాలి, చట్ట సవరణ చేసి టెట్ రద్దు చేయాత దితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఫణి భూషణ్, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహులు, మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ నగర నాయకులు ప్రభాకర్, నాగభూషణ, విరుపాక్షి గౌడ్ రాజన్న, రామా నుజన్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ కుమార్ ఇటుకలపల్లి ఎస్.ఐగా విజయ్ కుమార్

అనంతపురం క్రైమ్ జులై 6 ప్రభాతవార్త

ఇటుకలపల్లి(ఎస్.కె.యూ) ఎస్.ఐగా విజయకుమార్ నియమితుల య్యారు. ఈ మేరకు ఎస్పీ జగదీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటుకలపల్లి ఎస్.ఐగా విజయకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లా శ్రీశైలం, కొలిమిగుండ్ల, అనంతపురం జిల్లా శింగనమలలో ఎస్.ఐగా విధులు నిర్వహించారు. అంతకు ముందు అనంతపురం జీఆర్పీ ఎస్.ఐగా కూడా సమర్థవంతంగా సేవలు అందించారు. ఆయనకు ఇటుకలపల్లి పోలీసులు స్వాగతం పలికారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

త్రీ టౌన్ సిఐ గా కౌలుట్లయ్య

అనంతపురం క్రైమ్, జులై 6 ప్రభాతవార్త

అనంతపురం నగరం లోని త్రీ టౌన్ సిఐ కౌకుంట్లయ్య బాధ్యతలు సోమవారం బాధ్యతలు స్వీకరించా రు. ఈయన గతంలో సింగనమల సిఐగా పనిచేశారు. సాధారణ బదిలీలో భాగంగా త్రీ టౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టారు.



సిఐ కౌలుట్లయ్య

జంభూఫల అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రిఅర్బన్, జూలై 6 ప్రభాతవార్త

పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి సోమ వారం జంభూఫల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు ఎం.యోగా నందకుమార్‌శర్మ, రామకృష్ణ శర్మలు శ్రీబుగ్గరామ లింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో పాటు జంభూ ఫలాలు, పత్రాలతో ప్రత్యేకంగా అలంకరించి మహామంగళహారతి నిర్వహించారు. అదేవిధంగా శ్రీపార్వతిదేవి అమ్మవా రిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, సహదేవ శర్మ, శంతన్‌శర్మలు వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామికి, నవగ్రహాలకు అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మ లు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. పెద్దఎత్తున భక్తులు ఆలయా నికి చేరుకుని స్వామివా రిని, అమ్మవారిని దర్శించుకు న్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, ఇఒ రామాంజనేయులు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE AT PAVAGADA
O.S.No.189/2013

PLAINTIFFS: 1.Anithamma, W/o Shivappa, D/o Late Mylappa, Aged about 33 years, R/o Door No.13, Channappa building, Rukmini Nagara, IVth Main, 2nd Cross, Nagasandra post, Bangalore-560003.
2. Sowbhagyavathi W/o Thippanna, D/o Late Mylappa, Aged about 30 years, R/at Lakshminarayanappa Building, Veerapura village, Doddaballapura Taluk, Chikkaballapura district.
Vs
DEFENDANTS: Anjinamma & Others.

DRAFT PAPER PUBLICATION
UNDER ORDER 5 RULE 20 OF THE CODE OF CIVIL PROCEDURE, NOTICE TO THE L.R'S Defendant No.5(b) i.e.
D-5(b): Smt. Kutuva Parvathamma D/o Late Gangamma W/o Hanumanthappa, Aged about 50 years, R/at Thimmapuram Village, M.C.Palli post, Ramagiri Mandalam, Sri.Sathya Sai district, (A.P.) - Pin Code: 515621.
The plaintiffs have filed above suit against the defendants for the relief of Partition and seperate possession and such other reliefs in respect of the schedule property. You the Defendant No.5(b) is hereby summoned to appear before this Hon'ble court to answer all such questions relating to the above proceedings in order to enable the court effectually and completely to adjudicate upon and settled all the questions involved. The above matter is coming up for hearing on Defendant No.5(b) may appear before this court in Person or through her advocate on that day at 11.00 a.m.to file her

04ATP06.qxd:04ATP06.qxd 07/07/26 11:23 PM Page 1

డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలే దేశ సమైక్యతకు పునాది

ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు - డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ - ఒకే దేశం - ఒకే రాజ్యాంగం భావనకు ప్రాణత్యాగం చేసిన డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. ముఖర్జీ కలల భారతాన్ని సాకారం చేస్తోంది ఎన్డీఏ ప్రభుత్వం

ధర్మవరం టౌన్, జూలై 6 ప్రభాతవార్త

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ జాతీయవాది, విద్యావేత్త, దార్శనిక నాయకుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ....దేశ సమైక్యత, జాతీయ సమగ్రత, భారతీయ సంస్కృతి పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.

భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే కలకత్తా విశ్వ విద్యాలయానికి అత్యంత పిన్న వయస్కుడైన వైస్ ఛాన్సలర్‌గా సేవలం దించిన ఆయన, అనంతరం కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించినప్పటికీ దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా పదవిని త్యజించడం ఆయన దేశభక్తికి నిదర్శనమని మంత్రి అన్నారు. భారతీయ జనసంఘ్‌ను స్థాపించి దేశంలో జాతీయవాద రాజకీయాలకు బలమైన పునాది వేసిన నాయకుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. వ్యక్తిగత పదవులు, అధికారాల కంటే దేశ ప్రయోజనాలకే ఆయన అధిక ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించిన వ్యవస్థను వ్యతిరేకిస్తూ ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండకూడ దుఅనే నినాదంతో దేశ సమైక్యత కోసం ఉద్యమించిన మహోన్నత నాయకుడిగా ఆయన నిలిచారని మంత్రి వివరించారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉద్యమం సందర్భంగా అరెస్టై నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయిన ఆయన త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలు కన్న బలమైన, సమైక్య భారత నిర్మాణ దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ సమైక్యత, సుశాసనం, అభివృద్ధి లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఆయన ఆశయాలను ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులర్పించారు.

డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ భూమిపూజ

బుక్కరాయసముద్రం జూలై 6 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని కె. చెదుళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించబోతున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సోమ వారం ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భ ంగా వారు మాట్లడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆలయానికి శాస్త్రోకంగా భూమిపూజ చేపట్టామన్నారు.గ్రామాభివృద్ధితోపాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఎంపీపీ దాసరి సునీత,టీడీపీ జిల్లా ఉపాధ్య క్షుడు బండి ఆది నారాయణ, మాజీ సర్పంచులు నారాయణస్వామి, గుర్రప్ప,టిడిపి నాయకులు ఓబులపతి,తో పాటు పలువురు గ్రామ పెద్దలు తదితిరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎన్నో ఏళ్ల నాటి కల సాకారం.. విద్యార్థినుల కళ్లలో ఆనందం

- నసనకోట ఎంజేపీ పాఠాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

రామగిరి, జులై 6 ప్రభాతవార్త

ఇటీవల ప్రభుత్వం ఇక్కడ ఇంటర్మీడియట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎంపీసీ, బైపీసీ కోర్సులు మంజూరైన సందర్భంగా 10వ తరగతిలో 450 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థినిలు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రిజర్వేషన్ ప్రకారం అప్లికేషన్లను పరిశీలించి, ఎంపికైన విద్యార్థినీలకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ముందుగా వాటిని శ్రీ తిరుమల దేవర వెంక టేశ్వరస్వామి వారి పాదాల చెంత ఉంచి పూజలు చేయించారు. అనంతరం కీర్తిశేషులు పరిటాల రవీంద్ర ఆశీస్సులు తీసుకొని కళాశాలలో సీట్లు వచ్చిన వారికి అడ్మిషన్ పత్రాలను అందజేశారు. సీట్లు పొందిన విద్యార్థినిలు బాగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించి ఈ జూనియర్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మొదటి బ్యాచ్ విద్యార్థులుగా మీకు జీవితంలో ఎప్పటికీ గుర్తిండిపోతుం దన్నారు. అలాగే మీరు ఈ ఏడాది మంచి ఫలితాలు సాధిస్తే.. మరింత పేరు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత వ్రాత పరీక్ష నిర్వహించడానికి సమయం లేకపోవడం వలన ఈ ఏడాది మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పించామన్నారు. వచ్చే సంవత్సరం నుంచి వ్రాత పరీక్ష ఆధారంగా రిజర్వేషన్ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో విద్యార్థినిల కోసం జూనియర్ కళాశాల ఉండాలని అప్పట్లో పరిటాల రవీంద్ర పరితపించే వారని.. ఆయన కల ఈ రోజు సాకారమైందన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఈ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. ఇక్కడ ఇంటర్మీడియట్ కళాశాలకు అనుమతి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అడ్మిషన్ అప్లికేషన్‌కు పూజలు చేయిస్తున్న దృశ్యం

అడ్మిషన్ పత్రాలను చూపుతున్న విద్యార్థినీలతోపాటు ఎమ్మెల్యే పరిటాల సునీత

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల్ని తల్లిలాగా చూడాలి

- కస్తూరిబా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

రామగిరి, జులై 6 ప్రభాతవార్త

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను ఒక తల్లి లాగా చూడాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ పోస్టులను ఇటీవల భర్తీ చేసిన వారికి 14 మందికి పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఐసిడిఎస్ అధికారులు నాయకులు పాల్గొన్నారు. అలాగే చెన్నేకొత్తపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలలోని అంగన్వాడీ కేంద్రాలకు 172 ఇండక్షన్ విద్యుత్ స్టవ్ లను ఆయా అంగన్వాడి కేంద్రాల వర్కర్లకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఖర్చు చేస్తున్నాయన్నారు. కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చిన వారు బాధ్యతగా పని చేయాలన్నారు. ఆహారాన్ని బాగా ఉడికించి, మీరు రుచి చూసిన తర్వాతనే వారికి అందించాలన్నారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా అంగన్వాడీ వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందన్నారు. పిల్లల్ని తల్లి లాగా లాలిస్తూ, ఎక్కడా ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

కస్తూరిబా పాఠశాలలో ఆకస్మిక తనిఖీ : రామగిరి మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని భోజనశాలను, వసతి సౌకర్యాలను పరిశీలించి.. పలు సూచనలు చేశారు. పిల్లలకు వండిన వంటకాలను పరిశీలించి వంటలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినిలతో సమావేశమై.. భోజన నాణ్యత గురించి ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలకు సమయానికి భోజన వసతి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే 1కోటి 25 లక్షల రూపాయల ఎస్.ఎస్.ఏ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాల పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాలను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

అందజేసిన స్టౌవ్‌లను చూపుతున్న అంగన్వాడీలు

నూతన అదనపు భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ జులై 06 ప్రభాతవార్త

విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడడం లక్ష్యంగా విద్యుత్ భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రూపొందించిన "విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలు" పోస్టర్‌లను ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యుత్ వినియోగంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీ స్తుందని, ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యుత్ శాఖ రూపొందించిన ఈ పోస్టర్‌లో పొందుపరిచిన సూచనలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోస్టర్లను ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ/వార్డు సచివాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా రద్దీ ప్రాంతాలు మరియు విద్యుత్ కార్యాలయాల్లో ప్రదర్శించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ మీటర్ స్విచ్‌లను తడి చేతులతో తాకరాదు.పాడైన, తెగిపోయిన విద్యుత్ వైర్లు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.ఇంటి వైరింగ్‌ను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే చేయించాలి. భవన నిర్మాణ పనులు నిర్వహించే సమయంలో విద్యుత్ లైన్లకు సురక్షిత దూరం పాటించాలి. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఫీడర్ ప్యానెల్‌లకు అనధికారికంగా ఎవరూ చేరరాదు. పిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచి, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. విద్యుత్ తీగలపై బట్టలు ఆరేయడం, యాంటెన్నాలు లేదా ఇనుప వస్తువులు తగిలించడం చేయరాదు. విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టకూడదు. విద్యుత్ లైన్ల క్రింద వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు అత్యంత జాగ్రత్తతో నిర్వహించాలి. గృహ విద్యుత్ పరికరాలకు ఐ ఎస్ ఐ ప్రమాణాలు కలిగిన నాణ్యమైన సామగ్రినే వినియోగించాలి.ఫ్రిజ్, ఏసీ, గ్రైండర్, కుక్కర్, ఫ్యాన్ వంటి పరికరాలకు తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి. విద్యుత్ సరఫరాలో ఏవైనా లోపాలు, ప్రమాదకర పరిస్థితులు గమనించిన వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలి. విద్యుత్ సంబంధిత అత్యవసర సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ - 1912కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణ పోస్టల్ విడుదల చేసిన కలెక్టర్

16 వేల ఎకరాల భూ పట్టాల సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

త్వరలో సీఎం, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం - బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు , యస్, విష్ణువర్ధన్ రెడ్డి

పుట్టపర్తి, జులై 6 ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్ సమీపంలోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం సుమారు 300 మంది రైతులతో కలిసి బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి భారీ ర్యాలీగా చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.దాదాపు 16 వేల ఎకరాల భూములకు సంబంధించిన భూ పట్టాల సమస్య 70 ఏళ్ల తరబడి పరిష్కారం కాకపోవడంతో సుమారు 2 వేల నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు వెంటనే భూ పట్టాలు మంజూరు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన విష్ణువర్ధన్ రెడ్డి, గత ప్రభుత్వం రైతుల భూ పట్టాల సమస్యను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 2023 సంవత్సరంలోనే సర్వే చేసి , జిల్లా అధికారులు రికార్డులను పూర్తి చేశారు, కాని రికార్డులు పూర్తి చేసి పట్టాలు పంపిణీ చేయలేదు, దీని కారణంగా సమస్యలు పరిష్కారం కాలేదు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలోని నంబలపూలకుంట ప్రాంతం లో వందలాది మంది రైతులు పట్టాలు లేకుండానే 70 , నుంచి 80 సంవత్సరాల పైబడి భూములను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ మీడియాకు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ రైతుల భూ పట్టాల సమస్యపై త్వరలో సమగ్ర విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తా మని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి ప్రైవేటు సంస్థలు , కంపెనీల ప్రతినిధులు రైతులకు సంబందించిన భూముల్లో ప్రవేశించేందుకు అవకాశం ఉండదని, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శేఖర్, ఉత్తమ్ రెడ్డి, వెంకటేష్, హరికృష్ణ, రాజా రెడ్డి, ఓబులేసు, కళ్యాణ్, మండల అధ్యక్షుడు బాబ్జీ, రైతు ప్రతినిధులు రాజేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

కొంచెం ఇష్టం..కొంచెం కష్టం..!

ః బదిలీపై ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ప్రజలతో మమేకయత్నం..కట్టడికాని జూదం..!

తాడిపత్రి, జులై 6, ప్రభాతవార్తః

రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్. శాంతి భద్రతలపరంగా తాడిపత్రికి ఆయన ఓ ప్రత్యేకతను తేలేకపోయినా..ఆయనకు మాత్రం తాడిపత్రి ఓ ప్రత్యేకానుభూతిని అందించిందనే చెప్పాలి. 2025 జనవరిలో తాడిపత్రి ఎస్‌డీపీవోగా బాధ్యతలు చేపట్టిన రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ ఏడాదిన్నర పాటు సేవలందించారు. 'మీ మాటే ముఖ్యం' అంటూ సబ్‌డివిజనల్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రజలతో మమేకమయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హించడం, అసాంఘీక కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని తగిన చర్యలు తీసుకోవడం ఆయన ప్రత్యేక తకు నిదర్శనమని చెప్పాలి. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏడాదికి సంబంధించిన నేర నివేదిక ప్రకటనలో పురోగతి సాధించినట్లు ఆయన పేర్కొన్నా.. పట్టణంలోనూ, పట్టణ పరిసర ప్రాంతాల్లోనూ జూదాన్ని, గంజా యిని అరికట్టడంలో సఫలీకృతులు కాలేకపోయారనేది కాదనలేని సత్యం. మాజీ ఎమ్మెల్యేలు జేసీ ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిల మధ్య నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా నిత్యం సంఘర్షణతోనే ఆయన పనిచేయాల్సి వచ్చింది. స్థానిక నాయకులు, అసాంఘిక శక్తులతో కుమ్మక్కైన కొందరు పోలీసు అధికారులు ఆయనకు సహకరించకపోవడంతోనే పూర్తి స్థాయిలో అసాం ఘిక వ్యక్తులపై చర్యలు తీసుకోలేకపోయారని పోలీసు వర్గాలే పేర్కొం టున్నాయి. యాడికికి చెందిన బియ్యం వ్యాపారాన్ని కట్టడి చేయడంలో నూ, ఇక్కడి ఓ పోలీసు అధికారి అక్రమాలపై చర్యలు తీసుకోవడంలోనూ చూపిన చొరవ సబ్‌డివిజన్ మొత్తంపై చూపలేకపోవడం ఓ లోటేనని చెప్పాలి. ఓ ఐపీఎస్ అధికారిని తాడిపత్రికి నియమించగానే శాంతి భద్రతలు దాదాపు గాడిన పడతాయని ఊహించిన, ఆశించిన ప్రజానీ కానికి అది ఓ ఆశగానే మిగిలిపోయింది. మొత్తానికి రోహిత్ కుమార్ చౌదరి పనితీరు కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం అనే రీతిలో సాగిపో యింది. జిల్లా ఎస్పీ జగదీష్ సలహాలు, సూచనలతోనే తాడిపత్రిలాంటి సున్ని తమైన, సమస్యాత్మకమైన ప్రాంతంలో సమర్థవంతంగా పనిచేయగ లిగానని ఏఎస్పీ తరచూ చెబుతు ండేవారు. ప్రస్తుతం ఆయన పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీగా బదిలీపై వెళ్లడంతో ఇక్కడికి మరో ఐపీఎస్‌నే పంపిస్తారా..లేక డీఎ స్పీస్థాయి ర్యాంకర్‌నే పంపిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఈ చర్చ ఆసక్తికరంగా మారింది. ఏఎస్పీ బదిలీ సమచారం తెలిసిన వెంటనే యాడికి మండలంలోని చౌక బియ్యం నల్లబజారు వ్యాపారస్తులు ప్రత్యేక సమావేశమవడం ప్రాధాన్యాతను సంతరించుకుంది.

పల్నాడు ఏఎస్పీగా బదిలీ అయిన రోహిత్‌కుమార్ చౌదరి

ఎస్పీ జగదీష్ సూచనలతో తనదైన ముద్రవేసిన రోహిత్

శ్యాం ప్రసాద్ ముఖర్జీ జీవితం స్ఫూర్తి దాయకం - మంత్రి సత్యకుమార్ యాదవ్

అనంతపురం సిటీ, జులై 6 ప్రభాతవార్త

శ్యాం ప్రసాద్ ముఖర్జీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. భారత జనసంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ 125వ సంస్మరణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్, పార్టీ నేతలతో కలిసి హాజరై శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలని ఆర్టికల్ 370 రద్దు చేయాలని పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. అలాంటి నేతలను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశ సమగ్రత కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజేష్, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు తేజ, బిజెవైఎం నేతలు అజేష్ యాదవ్, అశోక్, సూర్యప్రకాష్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలిజిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి(కలెక్టరేట్), జూలై 6, ప్రభాతవార్త

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి 438 వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ గ్రీవెన్స్ వినతులు స్వీకరించే సమయంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మానవత్వంతో స్పందించి, నలుగురు దివ్యాంగులకు అక్కడికక్కడే అవసరమైన సహాయక ఉపకరణాలను అందజేశారు. గొరంట్ల మండలం, డి. గంగంపల్లి తండాకు చెందిన జితేంద్ర నాయక్ కుమారుడు వినోద్ కుమార్, అదే గ్రామానికి చెందిన జితేంద్ర నాయక్ కుమార్తె భగవత్ పవిత్ర బాయిలకు వీల్ చైర్ లు అందించారు. గొరంట్ల మండలం, రాజీవ్ కాలనీకి చెందిన తోటల వెంకటేష్ కుమారుడు, బధిర దివ్యాంగుడైన టి.వినయ్ కు, సోమందేపల్లి మండలం, బ్రహ్మస ముద్రం (ఆనందపురం) కు చెందిన హనుమంతరాయుడు కుమారుడు వెంకటేశులుకు శ్రవణ యంత్రాన్ని అంద జేయడం జరిగింది. సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన వెంటనే కలెక్టర్ వికలాంగులకు చేయూత అందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్, డీఆర్ఓ కొండయ్య,ఎస్‌డిసి విజయ కుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చన, సత్యసాయి జిల్లా దివ్యాంగ సేనా సమితి అధ్యక్షులు ఎం.కె.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి పోతు రాజుల నారాయణ స్వామి, దేవి భాయ్, భూదేవి, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, వీరేసు వెంకట రాముడు రెడ్డి, విశ్వనాథ్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బాధితులకు సత్వర న్యాయం చేయండి - పోలీస్ పీజీఆర్ఎస్ కు 134 పిటిషన్లు

అనంతపురం క్రైమ్ జులై 06 ప్రభాతవార్త

బాధితులకు సత్వర న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ జగదీష్ బాధితుల నుండి మొత్తం 134 పిటిషన్లను స్వీకరించారు. అర్జీలను క్షుణ్ణంగా పర